విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, మార్చి 29: ఆజామాబాద్ డివిజన్ 11కేవీ శంకర్‌మఠ్, సాయిబాబా టెంపుల్, ఆప్కో, వైఎంసీఏ, డీడీహెచ్ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డివిజన్ ఏడీఈ ఎం.విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 6 నుంచి 7:30 గంటల వరకు..

శంకర్‌మఠ్, నల్లకుంట, పద్మకాలనీ, అమర్ మెటర్నటీ హాస్పిటల్, సాయిబాబా కమాన్, వీహెచ్ లైన్, ఆంధ్రాబ్యాంక్, నారాయణగూడ వాటర్ వర్క్స్, శాంతి థియేటర్, విఠల్‌వాడి, తెలంగాణ టూరిజం, తెలుగు అకాడమీ, నారాయణగూడ బ్లడ్‌బ్యాంక్, లింగంపల్లి, నృపతుంగ కాలేజ్, పోలీస్ క్వార్టర్స్..

ఉదయం 7:30 నుంచి 8:30 గంటల వరకు

డీడీ హెచ్, సీసీ షరాఫ్ ఫీడర్ల పరిధిలోని విజ్ఞాన్‌పురి కాలనీ, డీడీహెచ్ ఆసుపత్రి, వీఎస్‌టీ మెయిన్ రోడ్, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్, రాజేంద్రనగర్ కాలనీ, సీసీ షరాఫ్ ఆసుపత్రి, భూమన్నగల్లీ, కాచిగూడ రైల్వేస్టేషన్ శాలిని ఆసుపత్రి పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తారు.

నేడు డయల్ యువర్ డీఎం

కాచిగూడ, మార్చి 29: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ లక్ష్యమని బర్కత్‌పుర డిపో మేనేజర్ ఎం. వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. నేడు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు సమస్యలు, సలహాలను 9000406069కు ఫోన్ చేసి తెలుపాలని విజ్ఞప్తి చేశారు.

ఆస్తిపన్ను చెల్లింపునకు రెండు రోజులే గడువు

- జీహెచ్ఎంసీ సర్కిల్-14 పరిధిలో రూ. 69.33 కోట్లు వసూలు
- మరో రూ.21 కోట్ల వసూలుకు చర్యలు
- ఆదివారం కూడా కౌంటర్లు తెరిచి ఉంచుతున్నట్లు అధికారుల వెల్లడి


పన్ను వసూలు చేస్తున్న డిప్యూటీ కమిషనర్ విద్యాధర్, ఏఎంసీ ఎంఎస్ శైలజ

అబిడ్స్, మార్చి 29 : ఆస్తి పన్ను చెల్లింపునకు ఆదివారంతో గడువు తేదీ ముగియనుంది. జీహెచ్ఎంసీ సర్కిల్-14 పరిధిలో ఇప్పటి వరకు రూ.69.33 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. మిగిలిన రెండు రోజులలో రూ.21.51 కోట్ల వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆస్తి పన్ను అసమానతలు, ఇతరత్రా సమస్యలు పరిష్కరించేందుకు వీలుగా ఆస్తి పన్ను పరిష్కార వేదికలను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా ఆస్తి పన్ను బకాయిలపై పడిన వడ్డీపై 90 శాతాన్ని మాఫీ చేస్తూ ప్రభుత్వం వన్‌టైం సెటిల్‌మెంట్ అవకాశాన్ని కల్పించడంతో అందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ సర్కిల్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఎంఎస్ శైలజ తెలిపారు. ఆస్తి పన్ను చెల్లింపునకు ఇక రెండు రోజులే గడువు ఉండడంతో ఆదివారం కూడా చెల్లింపు కౌంటర్లు తెరిచి ఉంటాయని డీసీ విద్యాధర్, ఏఎంసీ ఎంఎస్ శైలజ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ

రాంనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బంది

ముషీరాబాద్, మార్చి 29 : బస్తీలు, కాలనీల్లో పారిశుధ్య పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరుతూ జీహెచ్ఎంసీ సర్కిల్-15 పారిశుధ్య సిబ్బంది, అధికారులు శుక్రవారం రాంనగర్ డివిజన్‌లోని పలు బస్తీల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చెత్త సేకరణకు వచ్చే సిబ్బంది, రిక్షాల వారికి ప్రజలు తమ ఇండ్లలోని చెత్తను ఇవ్వాలని, ఎక్కడపడితే అక్కడ వేయకూడదంటూ ప్రచారం నిర్వహించారు. ఆటో టిప్పర్లు, రిక్షాలను సద్వినియోగం చేసుకోవాలని, నగరాన్ని స్వచ్ఛనగరంగా ఉంచడానికి బాధ్యతతో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది, బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు రావులపాటి మోజస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు అత్యధిక సీట్లు ఖాయం

బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ ఉన్నారన్నారు. ఏనాడు ఉద్యమంలో ప్రజల కోసం ఉద్యమించని నాయకులు బీఆర్ఎస్‌పై అవాకులు చెవాకులు పేల్చడం బాధకరమన్నారు. తెలంగాణలో 17 పార్లమెంట్ సీట్లలో 15 సీట్లను గులాబీ అభ్యర్థులు కైవసం చేసుకుంటారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సునీల్, జై శంకర్, నరేందర్ రెడ్డి, యాదగిరి, రవి, కుమార్, సలాం, సరస్వతి, జ్యోతి, నవీన్, మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు. - చాంద్రాయణగుట్ట, మార్చి 29

ఘనంగా గుడ్ ఫ్రైడే..

చిక్కడపల్లి, మార్చి 29 : గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రార్థనలు నిర్వహించగా.. సువార్త ర్యాలీలో 5వేల మంది క్రైస్తవులు పాల్గొన్నారు. హబ్రోన్ చర్చి సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జె. కురియన్, ఆర్. వీరాచారి పాల్గొన్నారు. అనంతరం భోజన సదుపాయం కల్పించారు. చిక్కడపల్లి, ముషీరాబాద్, చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సువార్త ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

'సాహిత్య సృష్టి - దృష్టి' గ్రంథావిష్కరణ

ఆచార్య కొలకలూరి మధుజ్యోతి రచించిన 'సాహిత్య సృష్టి - దృష్టి' గ్రంథావిష్కరణ సభ శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో జరిగింది. పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి చక్రపాణి, గీతాదేవి, ఆచార్య మధుజ్యోతి, ప్రొఫెసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. - ముషీరాబాద్

'చలో ఢిల్లీ' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కవాడిగూడ, మార్చి 29: దోమలగూడ, లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఈ నెల 31న ఆప్ 'చలోఢిల్లీ' కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య బద్ధంగా ప్రతిపక్షాలతో పోరాడే దమ్ములేక ప్రధాని మోదీ అణిచివేత రాజకీయాలు చేస్తూ దర్యాప్తు సంస్థల ముసుగులో ప్రతిపక్ష పార్టీలను బంధించి నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నాడని ఆరోపించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను చట్టవిరుద్ధంగా ఈడీతో అరెస్ట్ చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు బుర్రా రాముగౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ జమున గౌడ్, అధికార ప్రతినిధి జావేద్ షరీఫ్, దివ్యాంగ విభాగం కన్వీనర్ దర్శనం రమేశ్, నాయకులు శ్రీనివాస్, మౌనిక పాల్గొన్నారు.

వేసవి నేపథ్యంలో అడిక్‌మెట్ బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం రాంనగర్ ఈ సేవా వద్ద మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ అస్లాం, నాగులుయాదవ్, శివానంద్, గురుదీప్, రమేశ్, పాషా పాల్గొని మజ్జిక పంపిణీని ప్రారంభించారు. - ముషీరాబాద్, మార్చి 29

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

భోలక్‌పూర్‌లోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని నవభారత్ లైన్స్ క్లబ్, డాక్టర్ హిప్నో కమలాకర్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థినులకు పోషకాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నవ భారత్ లయన్స్ క్లబ్ జి. కృష్ణ వేణి, సైకాలజిస్ట్ జ్యోతిరాజా, అస్థిత్వం మంజుల, రాజా నరసింహ, హాస్టల్ వార్డెన్ భానుప్రియ పాల్గొన్నారు.
- కవాడిగూడ, మార్చి 29

కుట్టుమిషన్లు పంపిణీ

కుట్టుమిషన్లు పంపిణీ చేసిన డీసీపీ మధుకర్‌స్వామి, రాంకీ ఫౌండేషన్ చైర్మన్ రాంరెడ్డి

మెహిదీపట్నం మార్చి 29 : మహిళలకు ఆర్థిక అండదండలు అందించడానికి స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అంబర్‌పేట్ పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్, డీసీపీ పరవస్తు మధుకర్ స్వామి అన్నారు. నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి సీతారాంబాగ్‌లోని ఈశ్వరచంద్ర చారిటబుల్ ట్రస్ట్‌లో పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు రాంకీ ఫౌండేషన్ సహకారంతో ఉచితంగా కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీసీపీ మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని అన్నారు. సీతారాంబాగ్‌లో పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు పలు స్వయంఉపాధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తూ వారికి అండగా ఉంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ చైర్మన్ ముప్వ రాంరెడ్డి లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ డాక్టర్ లక్ష్మీకుమారి, ప్రొఫెసర్ రాజ్‌కుమార్, డాక్టర్ విద్యాభూషణ్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సదానందం

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ మాలమహానాడు ఫౌండేషన్ మద్దతు తెలుపుతున్నదని మాలమహానాడు ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు వెన్న సదానందం అన్నారు. ఫౌండేషన్ నాయకుడు నాటి రమేశ్, సారంగపాణి, పద్మారావు, శ్రీనివాస్‌తో కలసి ఆయన శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలసి మద్దుతు తెలిపారు.
- రవీంద్రభారతి, మార్చి 29

సగర కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న విజయేంద్ర సాగర్

చిక్కడపల్లి, మార్చి 29 : సగర కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని అఖిల భారత సగర మహాసభ అధ్యక్షుడు శెన్‌శెట్టి విజయేంద్రసాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లిలో అఖిల భారత సగర మహాసభ ఆధ్వర్యంలో సమావేశంలో మహాసభ ప్రధాన కార్యదర్శి హనుమంత్ సాగర్, కోశాధికారి పార్థసారథితో కలిసి విజయేంద్ర సాగర్ మాట్లాడారు. మహాసభలో కొందరు గిట్టనివారు మార్చి 24న కార్యవర్గం అనుమతి లేకుండా సమావేశం నిర్వహించి ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించడాన్ని ఖండించారు. ఈ విధంగా కార్యవర్గం అనుమతి లేకుండా సమావేశం నిర్వహించి కుల ప్రతిష్టను దిగజార్చిన వారిపై చట్టపరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో రాజేశ్ సాగర్, శ్యాం సాగర్, శ్రీనివాస్ సాగర్, విజయకుమార్ సాగర్, సుధాకర్ సాగర్, నర్సింగరావు సాగర్, మంజుల పాల్గొన్నారు.

అగ్నిప్రమాద ఘటన స్థలాన్ని సందర్శించిన నాంపల్లి ఎమ్మెల్యే

ఆసిఫ్‌నగర్ పీఎస్ వెనుకవైపు ఉన్న పోలీస్ ఖాళీ స్థలంలో గురువారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఘటన గురించి తెలుసుకున్న నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అక్కడికి చేరుకొని ఘటనపై ఆరా తీశారు. అగ్నిప్రమాదంపై విచారణ చేపట్టి కారకులను కఠినంగా శిక్షించాలని పోలీసులను ఆదేశించారు. - మెహిదీపట్నం, మార్చి 29

కాంగ్రెస్ పార్టీలోకి మిత్రకృష్ణ

అబిడ్స్ / కార్వాన్, మార్చి 29 : కార్వాన్ నియోజకవర్గానికి చెందిన నాయకులు గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో సీనియర్ నాయకులు మిత్ర కృష్ణ, తూముకుంట అరుణ్‌కుమార్, మిత్ర అభిషేక్, పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధీ భవన్‌లో ఆమె వారికి పార్టీ కండువాలను వేసి ఆహ్వానించారు. మిత్ర కృష్ణ, తూముకుంట అరుణ్‌కుమార్ దీపాదాస్ మున్షీకి బొకే అందించి ఆశీర్వాదం తీసుకున్నారు.

మంగళ్‌హాట్ మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్

మంగళ్‌హాట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్ కాంగ్రెస్‌లో చేరారు. కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు మిత్రకృష్ణ, యువత నాయకుడు అరుణ్‌కుమార్‌లతో కలిసి ఆమె గాంధీభవన్‌లో టీపీసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా దీపాదాస్ మున్సీ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

బీజేపీలోకి.. పాతనగర నాయకులు

పాతనగరానికి చెందిన పలువురు నాయకులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాధవీలత సమక్షంలో పార్టీలో చేరగా వారికి ఆమె కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.
- చాంద్రాయణగుట్ట, మార్చి 29

గోల్కొండలో.. ఇఫ్తార్

గోల్కొండ కోటలో రంజాన్ వేళ మరచిపోని సంఘటన జరిగింది. ఉపవాస దీక్షలలో ఉండే ముస్లింలకు హిందువులు ఇఫ్తార్‌ను ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి గోల్కొండ పోలీస్ స్టేషన్ సమీపంలో నివసించే గోల్కొండ బోనాల కులవృత్తుల సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, నాయకులు శ్రీకాంత్ చారి, సురేశ్‌చారి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చారు. కార్యక్రమానికి మైత్రి, పీస్ కమిటీ నాయకుల తరలివచ్చి సాయిబాబాచారిని అభినందించారు. - మెహిదీపట్నం, మార్చి 29

ఛోటాబజార్‌లో..

కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్ ఛోటాబజార్‌లో శుక్రవారం జరిగిన రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు అంశాలపై చర్చించారు. - మెహిదీపట్నం, మార్చి 29

మాలలపై మాదిగలు తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలి

- తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్

కవాడిగూడ, మార్చి 29: రాష్ట్రంలో మాల మాదిగలు సమానంగా ఉన్నారని, మాలలపై మాదిగలు చేసే తప్పుడు, గ్లోబల్ ప్రచారాన్ని మానుకోవాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కవాడిగూడలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మాదిగలు ఎంతమంది ఉన్నారో, మాలలు కూడా అంతే ఉన్నారని, ఈ విషయాన్ని పిడమర్తి రవి, గజ్జెల కాంతం గుర్తుంచుకోవాలని అన్నారు. మాలలు బాగుపడితే ఓర్వలేని మాదిగలు తమ వైఖరి మార్చుకోవాలని తెలిపారు. మాలలపై తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. కష్టపడ్డ మాలలకు సీట్లు ఇస్తే మాదిగలు ఓర్వలేక పోతున్నారని ఆయన మండిపడ్డారు.

డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయండి

పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమాయాదవ్

కాచిగూడ,మార్చి 29: స్థానికుల సహకారంతో డివిజన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ అన్నారు. శుక్రవారం ఆమె చెప్పల్‌బజార్ తదితర ప్రాంతాల్లో పర్యటించి చేపడుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జలమండలి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కన్నె రమేశ్ యాదవ్, భీంరాజ్, ఆర్. సంతోష్, సూలం రవియాదవ్, సత్యనారాయణ, ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

పదవులు అనుభవించి పార్టీ మారడం సరికాదు

అబిడ్స్, మార్చి 29 : బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో పదవులు అనుభవించి పార్టీ అధికారం కోల్పోగానే కొందరు నాయకులు అధికార పార్టీలో చేరడం తగదని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అశీష్‌కుమార్ యాదవ్ అన్నారు.

అబిడ్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గం మంగళ్‌హాట్ డివిజన్ నుంచి పరమేశ్వరిసింగ్‌కు రెండు సార్లు పార్టీ టికెట్ ఇచ్చి పార్టీ పోటీకి దింపిందని, ఆమెకు పార్టీలో అన్ని విధాలుగా గౌరవం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఆమె అధికారం కోసం కాంగ్రెస్ పార్టీలో చేరడంపై ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచి పార్టీని తిరిగి అధికారంలోకి తెచ్చేలా చూడాలే కాని పదవుల కోసం పార్టీలు మారడం తగదని సూచించారు. నాయకులు పార్టీలు మారినంత మాత్రాన పార్టీలకు ఒరిగే నష్టమేమి ఉండదని గోషామహల్ నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్ట పర్చేందుకు పాటుపడ్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి బీఆర్ఎస్ పార్టీకి ప్రజల మద్దతు కూడగడ్తామని ఆయన ఈ సందర్భంగా అన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

మారేడ్‌పల్లి, మార్చి 29 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మహేంద్రాహిల్స్‌లో బీజేపీ నాయకుడు మల్క కొమరయ్య కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఈటల మాట్లాడుతూ..కాంగ్రెస్ నాయకులు, సీఎం రేవంత్‌రెడ్డి మాటలకు హద్దు లేకుండా పోయిందన్నారు. ప్రశ్నించే గొంతు పేరుతో మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి ఐదు సంవత్సరాల కాలంలో ప్రజా సమస్యలను పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీతో 8 మంది బీజేపీ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వాఖ్యాలపై ఈటల రాజేందర్ కౌంటర్ ఇచ్చాడు. కాంగ్రెస్‌కు 8 మంది బీజేపీ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉంటే... కాంగ్రెస్ పార్టీ నుంచి 60 మంది ఎమ్మెల్యేలు బీజేపీ పార్టీ టచ్‌లోకి తీసుకోవడం పెద్ద విషయం కాదన్నారు. బీజేపీ టిక్కెట్ ఆశించిన వారందరితో కలిసి పని చేసి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం మరోసారి కోరుకుంటున్నట్లు ఈ సందర్భంగా ఈటల తెలిపారు.

యువతి అదృశ్యం

కవాడిగూడ, మార్చి 29 : కాలేజీకి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ డి. రాజు తెలిపిన ప్రకారం.. గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కవాడిగూడకు చెందిన ఓ యువతి నర్సింగ్ కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నది. గురువారం కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. యువతి తల్లి రేణుక పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాజు వెల్లడించారు.

ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ, మార్చి 29: అనారోగ్యంతో ఫుట్‌పాత్‌పై వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ ఎస్సై డి. సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (55) రైల్వే క్వార్టర్స్ సమీపంలోని పార్సిల్ కార్యాయలం ఫుట్‌పాత్‌పై అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖాన మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై గోధుమ రంగు చొక్క, నలుపు రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.8 ఉన్నట్లు తెలిపారు. వివరాల కోసం 8712660542లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

చికిత్స పొందుతూ యువకుడు ..

దవాఖానలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. కాచిగూడ హెడ్ కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన ప్రకారం.. బీహార్‌కు చెందిన నందకుమార్(19) సెక్యూరిటీ గార్డు. 26న బుద్వేల్-ఉందానగర్ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. రైల్వే పోలీసులు ఉస్మానియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కేసును రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మంటలంటుకొని వృద్ధురాలు..

మల్కాజిగిరి, మార్చి 29: పూజ గదిలో దీపం వెలిగిస్తుండగా మంటలంటుకొని ఓ వృద్ధురాలు మృతి చెందింది. అల్వాల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్ కథనం ప్రకారం.. మచ్చ బొల్లారం నివాసి రామసీత(74) గురువారం ఉదయం ఇంట్లోని పూజ గదిలో దీపం వెలిగిస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు మంటలంటుకున్నాయి. తీవ్ర గాయాలైన ఆమెను కుటుంబ సభ్యులు ఉస్మానియా దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మరణించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.